www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 25 నవంబర్ 2023

5

ఏలూరు



27, 28 తేదీల్లో మహాధర్నాను జయప్రదం చేయండి

చాట్రాయి:ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో జరిగే కార్మిక, రైతు మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మేడేపల్లి హోలీమేరి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోలీమేరి మాట్లాడుతూ నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. లేబర్ కోడ్స్ ఉపసంహరించాలని, స్కీం వర్కర్లకు, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర సామాజిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జంగారెడ్డిగూడెం:కార్మిక, కర్షక సమస్యలపై ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాథరావు తెలిపారు. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్త రైతు ఉద్యమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ నల్ల చట్టాలను రద్దు చేస్తామని, రైతుల విషయంలో తప్పు జరిగిందని కంటతడి ప్రదర్శిస్తూ చట్టాలను రద్దు చేయకుండా రైతులను మోసం చేశారని తెలిపారు.

రబీ నాట్లు సకాలంలో పూర్తయ్యేనా..!

ఇప్పటికీ సరిగా ప్రారంభం కాని నారుమడుల ప్రక్రియ

నవంబర్ నెలాఖరుకు నారుమడులు వేయాలన్న లక్ష్య సాధన కష్టమే

రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షలకుపైగా ఎకరాల్లో వరిసాగు

నాట్లు ఆలస్యమైతే సాగునీటి ఇబ్బందులతో రైతులకు అగచాట్లే

వంతులవారీ విధానంలో రబీకి సాగునీటి ప్రణాళిక



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీనాట్లు సకాలంలో పూర్తయ్యేనా అనే అనుమానం నెలకొంది. అధికారులు చెబుతున్న ప్రణాళికకు జరుగుతున్న పరిస్థితికి సంబంధం లేకుండాపోయింది. నవంబర్ పూర్తవుతున్నా ఇంకా రబీ నారుమడులు ముమ్మరంగా ప్రారంభం కాకపోవడంతో నాట్లు ఎప్పటికి పూర్తయ్యేనో అనే అనుమానాలు నెలకొన్నాయి. ఈ నెల 14, 15 తేదీల్లో రెండు జిల్లాలోనూ సాగునీటి సలహామండలి సమావేశాలు జరిగాయి. రబీ సాగుకు పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయాలని సాగునీటి సలహామండలి సమావేశాల్లో నిర్ణయించారు. పూర్తిస్థాయిలో నీరు అందుబాటులో లేకపోవడంతో వంతులవారీ విధానంతోపాటు పలు చర్యలు చేపట్టి సాగునీరు అందించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 4.60 లక్షల ఎకరాల్లో రబీలో వరి సాగవుతుండగా, ఏలూరు జిల్లాలో 56,190 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 2.40 లక్షల ఎకరాల వరకూ రబీ సాగు సాగనుంది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని 8,96,507 ఎకరాలకు 91.35 టిఎంసిల నీరు అవసరమని అధికారులు తేల్చారు. అయితే గోదావరి ప్రవాహాల ద్వారా వచ్చే నీటి లభ్యత 30 టిఎంసిలు, సీలేరు నుంచి 40.49 టిఎంసిలు, పోలవరం ప్రాజెక్టులో నీటినిల్వలు 12 టిఎంసిలు మొత్తం 82.49 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. దాదాపు పది టిఎంసిల నీరు లోటు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. మొత్తం సాగుకు నీరు అందించాలంటే వంతులవారీ విధానం, ఆయిల్ ఇంజిన్లు ద్వారా నీటిని ఎత్తిపోయడం, డ్రెయిన్లపై అడ్డుకట్టలు వేయడం ద్వారా సాగునీరు అందించాలని సాగునీటి సలహామండలి సమావేశంలో తీర్మానించారు. అందుకుగాను నవంబర్ నెలాఖరుకు నారుమడులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి డిసెంబర్ నెలాఖరుకు నాట్లు పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. మార్చి నెలాఖరున కాలువలు మూసివేయాలనే నిర్ణయం సైతం జరిగింది. అయితే ఇప్పటికీ రెండు జిల్లాల్లోనూ నారుమడులు ప్రారంభంకాని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ మాసూళ్లు ఇంకా 60 శాతంపైగా పూర్తికాని పరిస్థితి ఉంది. ఖరీఫ్ మాసూళ్లు పూర్తయ్యి రబీ నారుమడులు పూర్తయ్యేసరికి చాలా సమయం పట్టే పరిస్థితి కన్పిస్తోంది. రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు సైతం సరైన ప్రణాళికలు రూపొందించలేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. నారుమడులు ఆలస్యమైతే జనవరి నెలాఖరు వరకూ రబీ నాట్లు కొనసాగే పరిస్థితి రానుంది. అదే జరిగితే రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. జనవరి వచ్చేసరికి గోదావరి జలాలు మరింత తగ్గిపోతాయి. వంతులవారీ విధానం ప్రారంభమవుతుంది. శివారు పొలాలకు సాగునీటి పంపిణీ కష్టతరంగా మారనుంది. అదే జరిగితే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి రానుంది. రైతులకు అవగాహన కల్పించి రబీ నారుమడుల డిసెంబర్ పదో తేదీలోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటేనే రబీసాగు సాఫీగా సాగే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేకపోతే సాగునీటి ఇబ్బందులు తలెత్తి పంట దెబ్బతినే ప్రమాదం ఏర్పడనుంది. ఇప్పటికైనా అధికారులు అందుకు తగిన చర్యలు తీసుకుంటే రైతులకు మేలు జరుగుతుంది. ఇప్పటికే ఖరీఫ్ పంటను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డ రైతాంగం రబీలోనూ కష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జెసి లావణ్యవేణి

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలి : కలెక్టర్

నాణ్యమైన, పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించాలి

2,3 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా ఓటరు జాబితా సాధనపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా విజయవాడ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని జిల్లాకు సంబంధించిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ రోజున పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితి, ప్రత్యేకంగా 30 రోజులకుపైగా పెండింగ్‌లో ఉన్న ఫారాలు, ఎస్ఎస్ఆర్–2024 సమయంలో స్వీకరించిన ఫారాలు, అనోమలిస్ పెండింగ్, ముసాయిదా జాబితాపై ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, పెండింగ్ రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఇరోల్‌పై రిపోర్ట్‌లు, ఎపిక్ కార్డుల జనరేషన్, పంపిణీ, పిఎస్ఇలు, డిఎస్ఇలు, తదితర అంశాలపై ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన సమాచారాన్ని ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదుపై వచ్చేనెల రెండు, మూడు తేదీల్లో ప్రత్యేత ఓటరు నమోదు కార్యక్రమాన్ని జిల్లా అంతటా నిర్వహించి ఇంకా అర్హతున్న ఓటర్లను గుర్తించి నమోదు చేయించి నాణ్యమైన ఓటరు జాబితాను రూపొందించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రత్యేక ఓటరు నమోదుకు బూత్ లెవిల్ ఆఫీసర్స్ తమ బూత్‌లలో ఆ తేదీల్లో ఉండి నమోదు ప్రక్రియను చేపట్టాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఇఆర్ఒలు కె.బాబ్జీ, సత్యనారాయణమూర్తి, గీతాంజలి, తహశీల్దారు సోమశేఖర్, సిపిఒ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర పాల్గొన్నారు.



నిరసన దీక్ష చేపట్టిన కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని నిరసన దీక్ష

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకురాలు, మెప్మా ఆర్‌పిల సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సుభాషిణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సుభాసిణి మాట్లాడుతూ కార్మికుల 18 నెలల ఏరియర్స్ వేతనాలు, ఆప్కాస్ నుండి రావాల్సిన 34 నెలల హెల్త్ అలవెన్సులు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. నగర పంచాయతీ సిఫార్సు చేసిన స్వీపర్లను అప్కాస్‌లో చేర్చి న్యాయం చేయాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, మెప్మా ఆర్‌పిలను నగర పంచాయతీలో విలీనం చేసినట్లు ఆన్‌లైన్‌లో కూడా పొందుపరచాలని డిమాండ్ చేశారు. వారికి రావాల్సిన 10 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, మెప్మా ఆర్‌పిలు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న రవీంద్రభారతి

జంగారెడ్డిగూడెం పాఠశాలలో తనిఖీలు

జంగారెడ్డిగూడెం :స్థానిక జెడ్‌పిహెచ్ బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు పాఠశాలలో విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను విచారణ అధికారి తాడేపల్లిగూడెం డివైఇఒ రవీంద్ర భారతి పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించే భోజనాలను స్వయంగా తిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జంగారెడ్డిగూడెం జెడ్‌పి బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం సరుకులు దారిమళ్లింపు సంఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. సరుకుల పంపిణీ, వినియోగించే విధానం తదితర అంశాలను పరిశీలించారు. రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని, ఈ నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లోవకుమారి, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు విద్యార్థులను మాధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెతోపాటు మధ్యాహ్న భోజన పథకం కో ఆర్డినేటర్ బి.కుమార్, మండల విద్యాశాఖ అధికారి బి.రాముడు, ప్రధానోపాధ్యాయురాలు లోవ కుమారి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

టి.నరసాపురం:ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మక్కినవారిగూడెం పిఎసిఎస్ ఛైర్మన్ పిన్నమనేని చక్రవర్తి సూచించారు. మక్కినవారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ రైతులు దళారుల వద్ద మోసపోకుండా ప్రభుత్వమే మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందలపు మూర్తి, దాసరి రాంబాబు, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ ఆచంట నాగమణి, రైతులు సిరిమళ్ల విష్ణు, సంఘ కార్యదర్శి యు.సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్లను అభివృద్ధి చేయండి : సిపిఎం

టి.నరసాపురం:మండలంలో అధ్వాన్నంగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి అనుమోలు మురళీ డిమాండ్ చేశారు. ఆమేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. మండలంలోని పుట్రేపు, బండివారిగూడెం, మక్కినవారిగూడెం, బంధంచర్ల తదితర ఆర్అండ్‌బి, పంచాయతీ రాజ్ రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. ఏళ్ల తరబడి ఇదే దుస్థితి దాపురించిందన్నారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారిన రోడ్ల అభివద్ధికి నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ద్వామా పీడీకి వినతిని అందిస్తున్న నాయకులు

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం డ్వామా పీడీ ఎ.రాముకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం ఉపాధి హామీ కూలీల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని, మరోపక్క వర్ష ప్రభావం తక్కువగా ఉండటంతో పంటలు ఎండిపోయాయని, దానివల్ల వ్యవసాయ కూలీలకు పనుల్లేకుండా పోయాయని తెలిపారు. పనుల్లేని వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు కల్పించాలని కోరారు. వ్యవసాయం దెబ్బతినడంతో ఎక్కువ మంది కూలీలు సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం ద్వారా అదనంగా పనులు కల్పించి వ్యవసాయ కూలీల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఉపాధి హామీ చట్టం పేదలకు వరంలా ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయ కార్మికుల్లో ఎక్కువమంది దళితులు, గిరిజనులు, ఇతర కులాల్లో ఉన్న పేదలు ఈ పనులు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో ఉపాధి పనులు చేసిన కూలీలకు మూడు నుండి ఆరు వారాల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో కూలీలకు పేస్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కొన్ని మండలాల్లో పే స్లిప్పులు ఇవ్వకుండానే ఇస్తున్నట్లు బిల్లులు పెడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి అవినీతికి పాల్పడుతున్న వారిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూజివీడు, చింతలపూడి, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లోని మండలాల్లో ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇలాంటివారిని వెంటనే విధులు నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కూలీలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం, ఉపాధి హామీ సిబ్బంది పరిష్కారం చేయాలనీ కోరారు. లేని పక్షంలో ఉపాధి కూలీలతో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం డ్వామా పీడీ మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరో పది రోజుల్లో ఉపాధి కూలీలకు వేతన బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, జిల్లా ఉపాధ్యక్షులు తామ ముత్యాలమ్మ, ఎస్.మహంకాళిరావు, సహాయ కార్యదర్శి ఎం.సుధారాణి, జిల్లా నాయకులు ప్రభాకర్, డి.దాసు, మేరీ, సాయికృష్ణ పాల్గొన్నారు.

నేడు కొయ్యలగూడెంలో జాబ్‌మేళా

కొయ్యలగూడెం:ఈనెల 25వ తేదీన కొయ్యలగూడెంలో జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారి సి.మధుభూషణరావు తెలిపారు. కొయ్యలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిరిజన యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఎపి యువజన సర్వీసుల శాఖ, ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మామిడికి సంపూర్ణ రీతూ కవచ్ బీమా

ఏలూరు:సంపూర్ణ రీతూ కవచ్ రబీ 2023–24లో రాష్ట్ర అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఎఐసి) వారు మామిడి పంటకు బీమా అందిస్తున్నారని జిల్లా ఉద్యానవన శాఖాధికారి డాక్టర్ ఎస్.రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న రైతులకు కూడా మామిడి పంట నష్ట పరిహారం చెల్లిస్తారని, ఈ పథకంలో రైతులు కట్టాల్సిన, బీమా వివరాలు ఎకరాకు రైతులు చెల్లించాల్సిన రూ.1200, 18 శాతం జిఎస్‌టి కలిపి మొత్తం రూ.1416కు గాను ఎకరాకు రూ.24 వేలు బీమా చేస్తారని తెలిపారు. వచ్చేనెల 15 నుండి 2024 మే 31 మధ్య కాలంలో వర్షపాతం, ఉష్ణోగ్రత గాలిలో తేమ, ఈదురు గాలులకు సంబంధించిన పరిమాణాలను మండల స్థాయిలో గల స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ వాతావరణ పరిక రాల సహాయంతో లెక్కించి, దాన్ని ఈ పథకంలో ముందుగా పొందుపరుస్తారని చెప్పారు. ఈ పరిమాణాల్లో సరిపోల్చి నప్పుడు వచ్చిన తేడా ఆధారంగా నష్ట పరిహారం చెల్లిస్తాం`న్నారు. జిల్లాలో 37,519.14 ఎకరాలు మామిడి పంటను సాగు చేస్తున్నారని, ఇందులో ఆగిరిపల్లి, నూజివీడు, చింతల పూడి, చాట్రాయి, లింగపాలెం, ముసునూరు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో ఉందన్నారు. మరిన్ని వివరాల కోసం మండ ల ఉద్యాన అధికారులను, అగ్రికల్చర్ బీమా కంపెనీ ఆఫ్ ఇండియా అధికారి కల్పన (9618117844)ను సంప్రదించాలని రామ్మోహన్ కోరారు.

ఘనంగా ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు పట్టాభి సీతారామయ్య జయంతి

ప్రజాశక్తి - భీమడోలు




పట్టాభి సీతారామయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకులు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య 143వ జయంతిని ఆయన స్వగ్రామమైన గుండుగొలనులో భోగరాజు పట్టాభి సీతారామయ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సంఘం ఛైర్మన్ మామిళ్లపల్లి కాళీబాబు, కార్యదర్శి బి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు, గ్రామస్తులు సీతారామయ్య వారసులు గుండుగొలను చెరువుగట్టుపై ఏర్పాటుచేసిన పట్టాభి సీతారామయ్య శిలా విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కాళీబాబు మాట్లాడుతూ అప్పట్లో ఆంధ్రాబ్యాంకు గుండుగొలను శాఖ కొనసాగిన సమయంలో అప్పటి బ్యాంకు జాతీయస్థాయి ఉద్యోగులు, ప్రముఖులు సీతారామయ్య స్వస్థలమైన గుండుగొలనులో విద్య, ఆరోగ్యం, వ్యవసాయాభివృద్ధికి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇదేవిధంగా గ్రామాభివృద్ధికి సైతం తమవంతు సహకారం అందజేస్తారని తెలిపారన్నారు. ఆయన సంస్కరణార్థం తన కాలంలో ఆయన వినియోగించిన వివిధ వస్తువులతో స్థానికంగా మ్యూజియం ఏర్పాటు చేస్తామని కూడా హామీ ఇచ్చినప్పటికీ కార్యరూపం దాల్చలేదని బ్యాంకు అధికారుల దృష్టికి తెచ్చారు. ఆంధ్రులు తమ బ్యాంకుగా చెప్పుకునే ఆంధ్రా బ్యాంకు వివిధ కారణాలవల్ల యూనియన్ బ్యాంక్‌గా మారిపోయిందన్నారు. అంతేకాక ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకులు సీతారామయ్య గురించి రానున్న తరానికి తెలిసే అవకాశం ఉండదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన గురించి భావితరాలకు తెలిసేందుకు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను శాఖ మేనేజర్, హెచ్.భవాని, సొసైటీ మాజీ ఛైర్మన్ వివివి.భాస్కర్, మాజీ ఎంపిపి సిరిబత్తిన కొండబాబు, మాజీ సర్పంచి చిట్టి రవి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు అడ్డగింత

సర్వీసు రోడ్లు నిర్మించాకే పనులు చేపట్టాలని రైతులు డిమాండ్

ప్రజాశక్తి - చింతలపూడి



రైతులతో మాట్లాడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


సర్వీసు రోడ్డు నిర్మించకుండా గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు చేపట్టడాన్ని మండలంలోని రేచర్ల గ్రామంలో రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. పొలాలకు వెళ్లే సర్వీస్ రోడ్లు వేయకుండా మెయిన్ రోడ్డు నిర్మిస్తే రైతులు పొలాల్లోకి వెళ్లడానికి అవకాశం ఉండదని, ముందు సర్వీసు రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. దీంతో గ్రీన్ ఫీల్డ్ హైవే సిబ్బంది రైతులతో చర్చించారు. చింతలపూడి ఎంపిపి రాంబాబు, సర్పంచి శివరామకృష్ణ, కాంట్రాక్టర్లతో, సిబ్బందితో మాట్లాడారు. దీనిపై శనివారం రైతులతో శనివారం సమావేశం ఏర్పాటు చేసి న్యాయం చేసేలా చూస్తామని ఎంపిపి చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు ఉప్పల శ్రీను, కంచర్ల శ్రీను, బలుసు సతీష్, దొంతా బాల వెంకటేశ్వర రాఘవరావు, కొమ్మిన అప్పారావు, తాళ్ల రమేష్, పసుపులేటి సత్యనారాయణ, కంచర్ల మల్లికార్జునరావు, అడపా పిచ్చయ్య, రైతు సంఘం నాయకులు దొంత కృష్ణ, రేచర్ల సర్పంచి శివరామకృష్ణ పాల్గొన్నారు. ఈ ఆందోళనకు సిపిఐ మండల కార్యదర్శి గురవయ్య, సహాయ కార్యదర్శి సోమశేఖర్, జంగా రామచంద్రరెడ్డి మద్దతు తెలియజేశారు.

దాతల సేవలు అభినందనీయం

భీమడోలు:విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని గుండుగొలను మావుళ్లపల్లి సోమరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత అన్నారు. స్థానికులతో పాటు, ఎన్ఆర్ఐల సభ్యత్వాలతో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ముక్కు ఫౌండేషన్ పాఠశాల స్థాయిలో పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన వై.బాలనాగఅంజనశ్రీ, వి.సుష్మశ్రీ ఒక్కొక్కరికి రూ.పది వేలు వంతున, ద్వితీయ స్థానాలు సాధించిన ఎస్ యుగంధర్, కె.హేమంత్‌కు ఒక్కొక్కరికి రూ.ఐదు వేలతోపాటు ట్రోఫీని శుక్రవారం పాఠశాల ఆవరణలో అందజేశారు. ఈ సందర్భంగా ముక్కు ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ తమ పూర్వీకులు ముక్కు సత్యనారాయణ గుండుగొలనులో ఉపాధ్యాయులుగా పని చేశారన్నారు. ఆయన వారసులు వివిధ రంగాల్లో దేశ, విదేశాల్లో ప్రముఖులుగా కొనసాగుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ముక్కు సత్యనారాయణ సంస్మరణార్థం వారు మూడు సంవత్సరాలుగా గుండుగొలను హైస్కూల్లో పదో తరగతిలో ప్రతిభ కనపరిచిన నలుగురికి సత్యనారాయణ మెమోరియల్ కప్‌తో పాటు నగదును ప్రోత్సాహంగా అందజేస్తున్నా మన్నారు.

ఘనంగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల



పీయూష్‌కుమార్‌కు వ్యవసాయ ఉత్పత్తులు చూపుతున్న రైతులు

మండలంలోని తిమ్మాపురంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర శోభాయమానంగా సాగింది. తొలుత ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాణిజ్య పరిశ్రమల కేంద్ర మంత్రిత్వశాఖ అడిషనల్ సెక్రటరీ పీయూష్ కుమార్‌కు గ్రామ సర్పంచి వై.రజనీ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తిమ్మాపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోషణశక్తి నిర్మాణ అభియాన్, ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్, ఆయుష్మాన్ భారత్, స్వయం సంఘాల ఉత్పత్తులు, పిఎం సురక్ష బీమాయోజన, తదితర స్టాల్స్‌ను సందర్శించి అయా పథకాలద్వారా లబ్ధిదారులకు అందిస్తున్న వివరాలను పీయూష్ కుమార్‌కు అధికారులు వివరించారు. వ్యవసాయ రంగంపై ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం, ఇతర కార్యక్రమాల వివరాలను వివరించారు. ఆయుష్మాన్ భారత్ కింద జిల్లాలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ చొరవతో రెండు లక్షల ఖాతాలు తెరువబడ్డాయని వైద్యాధికారి తెలిపారు. ఈ సందర్భంగా వి.సత్యనారాయణ బుర్రకథ బృందంచే కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై విపులంగా ప్రజలకు కళారూపంద్వారా అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల బాలబాలికలు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి.


కేంద్ర ప్రభుత్వ పథకాలు పేదలకు నూరుశాతం అందాలి : పీయూష్ కుమార్

నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ ఫలాలు గ్రామస్థాయి వరకు అందించడమే 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర 'ప్రధాన లక్ష్యమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి పీయూష్ కుమార్ అన్నారు. ద్వారకా తిరుమల మండలం తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం పండుగ వాతావరణంలో జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం గ్రామ సర్పంచి వై.రజని అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పీయూష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సందేశాన్ని వినిపించారు. ప్రజలచేత 'వికసిత్ భారత్ ప్రతిజ్ఞను ఆయన చేయించారు. ఈ సందర్భంగా పీయూష్ కుమార్ మాట్లాడుతూ 140 కోట్ల మంది జనాభా కలిగిన భారతదేశాన్ని 2047 నాటికి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, 'వికసిత్ భారత్'గా రూపొందించడమే ప్రధానమంత్రి లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ అమలు చేసే పథకాలను గ్రామ స్థాయిలోని ప్రజలకు అవగాహన కలిగించడం, తద్వారా ఈ ఆ సంక్షేమ ఫలాలు పొందిన లబ్ధిదారుల కలిసి వారు పొందిన లబ్ధిని తెలుసుకోవడం, ఆ గ్రామంలో ఇంకా ఎవరైనా లబ్ధి పొందనివారు ఎవరైనా ఉంటే వారికి కూడా సంక్షేమ ఫలాలు వారు పొందేలా చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. కోవిడ్ సమయంలో కూడా గరీబ్ కళ్యాణ యోజన ద్వారా పేదలకు ఆహార భద్రత కల్పించామన్నారు. రైతులకు పిఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని, నిరుపేదలకు పిఎం ఆవాస యోజన ద్వారా పక్కా గృహాలు, మహిళల సాధికారతకు పిఎంఇజిపి ద్వారా రుణాలు, ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్య బీమా కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎంఎల్‌ఎ తలారి వెంకటరావు, జెసి బి.లావణ్యవేణి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ పాల్గొన్నారు.

ఆర్ఓ ప్లాంట్ పునరుద్ధరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం సచివాలయం-2 వద్ద సుజల వాటర్ ప్లాంట్ గత పది రోజులుగా నిరుపయోగంగా ఉంది. మోటారు, ఇతర పరికరాలు పని చేయని కారణంగా ప్లాంట్ మూత పడింది. సర్పంచి అలకనంద, ఉప సర్పంచి సాంబశివరావు, ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యులందరి ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ మరమ్మతులు చేయించారు. మరమ్మతులు చేయటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


ట్రై సైకిల్ అందిస్తున్న టిడిపి నాయకులు

వికలాంగుడికి ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మానవసేవే మాధవ సేవగా భావించి బొప్పన రాధమ్మ వికలాంగులకు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాంచంద్రశేషు, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు పల్లి శ్రీను అన్నారు. టిడిపి మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ ఆధ్వర్యంలో నడవలేని స్థితిలో ఉన్న వికలాంగుడు అప్పారావుకు బొప్పన రాధమ్మ ఆర్థిక సహాయంతో వీల్ ట్రై సైకిల్ అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అన్నపరెడ్డి గంగాధర్, జిల్లా కార్యదర్శి బొబ్బర రాజ్‌పాల్ కుమార్, పాతురి అంబేద్కర్, చట్టిబోయిన రామలింగేశ్వరావు పాల్గొన్నారు.

ఘనంగా ఏసుబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

వైసిపి మండలాధ్యక్షులు మొట్రూ ఏసుబాబు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం వైసిపి నేతలు ఘనంగా నిర్వహించారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపి చొపర్ల సునీత, నాయకులు తడంకి రాజేష్, రాచురి కుమార్, బేతురాజా, పెయ్యేరు వైస్ సర్పంచి దివి సతీష్ పాల్గొన్నారు.


ముసునూరులో..

పలుచోట్ల 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని రమణక్కపేటలో భవిష్యత్తుకు గ్యారెంటీ నమోదు కార్యక్రమం శుక్రవారం టిడిపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ నాయకులు రంగు వాసు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఏ ఒక్కరూ కూడా ఆనందంగా లేరన్నారు. పేదవాడిని, మధ్య తరగతివారిని పన్నుల భారంతో పీల్చి పిప్పు చేస్తుందన్నారు. పెట్రోలు, మద్యం, కరెంట్ బిల్లులు, నిత్యావసర వస్తువులు పేద వాడికి అందని ద్రాక్షలా మిగిలిపోతున్నాయనారు. కచ్చితంగా 2024లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి అందరినీ అందుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, నోబెల్ రాజు పాల్గొన్నారు.

ముదినేపల్లి : టిడిపి అధినేత చంద్రబాబు పాలనతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపిపి వీరమల్లు నరసింహరావు అన్నారు. మండలంలోని వడాలి గ్రామంలో బూతు నెంబర్-82లో శుక్రవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కట్ట కోటయ్య, అనగాని కృష్ణమూర్తి, కట్టా రామయ్య పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టిడిపిదే విజయం : చింతమనేని

ప్రజాశక్తి - టి.నరసాపురం

వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయదుందుభి మోగిస్తుందని దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. మండలంలోని మక్కినవారిగూడెంలో శుక్రవారం ప్రయివేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన ఆ పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారని, అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సిఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. టిడిపి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు ఆలపాటి పాపారావు, నాళం ప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు


ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

40 మంది ఆటో డ్రైవర్లపై కేసు

ప్రజాశక్తి - ఏలూరు

ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న సుమారు 40 మంది ఆటో డ్రైవర్లపై ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ కేసులు నమోదు చేశారు. ఎస్‌పి మేరీప్రశాంతి, డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఏలూరు టౌన్ పరిధిలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆటో యూనియన్లు, ఆటోస్టాండ్‌లలో రహదారి ప్రమాదాల నివారణకు, పాఠశాలలు, కాలేజీ పిల్లలను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు, సలహాలు అందించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏలూరు టౌన్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలు, రహదారుల్లో వేగ నియంత్రణ చేసుకుంటూ ఆటోలో ఉన్న విద్యార్థులను సురక్షితంగా విద్యాసంస్థలకు, వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఏలూరు టౌన్ పరిధిలో ఎక్కువగా వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు ఉన్న కారణంగా ఆటో డ్రైవర్లు రోడ్డుకు అవరోధం కల్పించరాదన్నారు. ఆటోల్లో విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలను తీసుకోవాలని, ఆటో డ్రైవర్లకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏలూరు టూ టౌన్ ఎస్ఐ శుభశేఖర్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఆటో యూనియన్లు ఆటోస్టాండ్‌లలో రహదారి ప్రమాదాల నివారణకు, స్కూల్స్, కాలేజీ పిల్లలను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు, సలహాలు అందించారు.

అంతర్ కళాశాలల క్రీడాపోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక సర్ సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, కాకినాడ పరిధిలోని కళాశాలల మధ్య అంతర్ కళాశాలల ఆటలపోటీలు, విశ్వవిద్యాలయ జట్ల ఎంపిక కార్యక్రమం శుక్రవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. ఈ పోటీలకు ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్ ప్రసంగిస్తూ క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా సర్‌సిఆర్.రెడ్డి విద్యాసంస్థల ఉపాధ్యక్షులు, ఉషా పిక్చర్స్ అధినేత డాక్టర్ వివి.బాలకృష్ణారావు ప్రసంగిస్తూ క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్తేజాన్ని కలుగజేస్తాయని, విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు కాకినాడ పరిధిలోని వివిధ కళాశాలల నుంచి 51 వాలీబాల్ పురుషుల జట్లు, 14 మహిళల జట్లు, 13 హ్యాండ్‌బాల్ పురుషుల జట్లు, ఏడు మహిళల జట్లు, ఎనిమిది నెట్‌బాల్ పురుషుల జట్లు, ఒక్క మహిళల జట్టు, 18 షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల జట్లు, 11 మహిళల జట్లు పాల్గొంటున్నట్లు, సుమారు వెయ్యి మంది విద్యార్థులకు వసతి, భోజన సదుపాయం కళాశాల ప్రాంగణంలోనే ఏర్పాట్లు చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలను పారదర్శకంగా జరపడానికి వివిధ కళాశాలల నుంచి సుమారు 200 మంది అధికారులను ఉపయోగించుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్‌సిఆర్.రెడ్డి విద్యాసంస్థల ఇన్‌ఛార్జి కార్యదర్శి కిలారు ప్రభాకరరావు, కరెస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, మేనేజింగ్ కమిటీ సభ్యులు హరిరామకృష్ణంరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్


ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆళ్ల నాని

ప్రజల ఆశీర్వాదమే కొండంత బలం

14వ డివిజన్‌లో ఎంఎల్ఎ ఆళ్ల నాని పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజల ఆశీర్వాదమే తమకు కొండంత బలమని ఏలూరు ఎంఎల్ఎ, వైసిపి జిల్లా కార్యదర్శి ఆళ్ల నాని అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన 14వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో ఏలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. నగరంలో విలీనమైన గ్రామాల అభివృద్ధికి పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. గోదావరి జలాలను మళ్లించి విలీన గ్రామాల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల కాలంలో వైసిపి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, ఆయా కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించే బ్రోచర్లను అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దారపు అనూష తేజ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్‌బాబు, గుడిదేసి శ్రీనివాసరావు, వైసిపి నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, ఎఎంసి ఛైర్మన్ నెరుసు చిరంజీవులు, వైస్ ఛైర్మన్ కంచన రామకృష్ణ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటో కార్మికులకు పోలీసులు శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ మూర్తి మాట్లాడుతూ సామర్థ్యానికి మించి ప్రజలను తరలిస్తే జరిగే ప్రమాదాలను వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని ధ్రువీకరణ పత్రాలు ఎంత ముఖ్యమో, సురక్షితమైన ప్రయాణం అంతే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యూనియన్ బ్యాంక్ 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఆర్.పేటలోని యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 45 మంది బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా రీజనల్ హెడ్ ఎంజికె.మూర్తి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ నవంబర్ 11 యూనియన్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకుంటున్నామని, ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తామని, అందులో భాగంగా రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ అభివృద్ధికి సహకరిస్తున్న కస్టమర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ రామ్మోహన్‌రావు, కిరణ్‌కుమార్, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు, పిఆర్ఒ కెవి.రమణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో అభివృద్ధి

ప్రజాశక్తి - ముసునూరు

సిఎం జగన్ గ్రామాల్లో సచివాలయం వ్యవస్థ ద్వారా అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన తెలిపారు. మండలంలోని ముసునూరు గ్రామ సచివాలయంలో ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో పల్లెకుపోదాం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లా డుతూ ముసునూరు గ్రామానికి రూ.17,77,59,843 సంక్షేమం, నూతన భవనాల నిర్మాణానికి నిధులు మం జూరు చేసి అభివృద్ధి చేశారన్నారు. జెడ్‌పిటిసి సభ్యులు ప్రతాప్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నేరవేర్చలేని హామీలు, ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వాలంటీర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు, రేగుల గోపాలకృష్ణ, తులిమెల్లి రంగరావు, ఇఒపిఆర్‌డి బసవ రాజు, అచ్యుత సత్యనారాయణ, ఎంపిడిఒ సూపరిం టెండెంట్ కూచిపూడి సాయిరామ్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సన్నీరాజన్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని బొర్రంపాలెంలో సచివాలయం-1 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో సచివాలయం ద్వారా వాలంటీర్లు నేరుగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. బొర్రంపాలెంలో సచివాలయం-1 పరిధిలో రూ.24 కోట్లు లబ్ధిదారులకు నేరుగా ఖాతాలో సిఎం జగన్ జమ చేశారన్నారు. బొర్రంపాలెంలో రోడ్డు, డ్రెయినేజీల వ్యవస్థ వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాతే త్వరతగతిన పూర్తవుతున్నాయని తెలిపారు. అనంతరం పల్లెకు పోదాం కార్యక్రమంలో ప్రతి ఇంటి గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనురాజు, మాజీ ఎంపిపి కొత్త ప్రకాష్, సర్పంచి కె.వెంకటేశ్వరమ్మ, పడాల సత్యనారాయణ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

పిఎం ఉజ్వల యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీతారామపురం గ్రామ సర్పంచి అత్తి మురళీమోహనరావు అన్నారు. మండల పరిధిలోని సీతారామపురంలో శ్రీభాగ్యలక్ష్మి ఇండేన్ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యంలో పిఎంయువై పథకంలో గ్యాస్ కనెక్షన్స్ మంజూరైన 51 మంది లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతి, ఎల్‌పిజి సేల్స్ మేనేజర్ ఎంఎస్.విజయ్‌కుమార్, శ్రీభాగ్యలక్ష్మి, ఇండేన్ గ్యాస్ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ పివి.శ్రీనివాస్ లబ్ధిదారులు పాల్గొన్నారు.


గ్యాస్ కనెక్షన్స్ పంపిణీ చేస్తున్న మురళీమోహనరావు

పలుచోట్ల 'వై ఎపి నీడ్స్ జగన్'

ప్రజాశక్తి - జంగారెడ్డగూడెం

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడానికి వై ఎపి నీడ్స్ జగన్ ప్రచార కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అన్నారు. స్థానిక 12, 13 ,14 వార్డుల్లో నిర్వహించిన వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసిపి జెండా ఎగురవేశారు. అనంతరం బత్తిన నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి సక్రమంగా ప్రజలకు అందించడంలో వైసిపి ప్రభుత్వం ముందుంటుందన్నారు. అమ్మఒడి, రైతుభరోసా, ఆసరా, జగనన్న విద్యదీవెన, జగనన్న ఆరోగ్యశ్రీ, జగనన్న గోరుముద్ద, జగనన్న ఆరోగ్య సురక్ష ఇంకెన్నో పథకాలు పెట్టి ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా పథకాలను ఇంటివద్దకే అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ఎం.వీరాంజనేయులు, వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య, స్థానిక కౌన్సిలర్ పిపిఎన్.చంద్రరావు, తాతకుంట్ల నాగవెంకటలక్ష్మి, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ తాతకుంట్ల రవి, కౌన్సిలర్లు అయినాల వెంకటరమణమూర్తి, నాయకులు బత్తిన చిన్న, శ్రీను, గోడపాటి రాధాకృష్ణ, చిప్పాడ వెంకన్న పాల్గొన్నారు.


ఆగిరిపల్లిలో...

ఆగిరిపల్లి : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సిఎం కావాలని వైసిపి మండల అధ్యక్షులు పల్లగాని నరసింహరావు అన్నారు. మండల పరిధిలోని అడవినెక్కలంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన అభివృద్ధిపై డిబిటి, నాన్‌డిబిటి ద్వారా వచ్చిన సొమ్మును వివరించే డిస్‌ప్లే బోర్డును ప్రదర్శించారు. అనంతరం వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వి.రాజు, గొల్లగూడెం సర్పంచి ఎల్.రమేష్, పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.హరిబాబు, ఉపాధ్యక్షులు టి.పావనకుమారి, ఎంపిపి జి.అనూష, జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, జెసిఎస్ కన్వీనర్ ఎన్.భాస్కరప్రసాద్, టి.గోపీ, ఎల్.శివరామ్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : సంక్షేమ పథకాల రథసారధి జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సిఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెదగొన్నూరు సచివాలయ పరిధిలో శుక్రవారం ఎపికి జగన్ననే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, గంట సంధ్య, ఏసుబాబు, సర్పంచి తాడంకి శిరీష రాజేష్, ఎంపిటిసి సభ్యులు ఏసు, వైస్ ఎంపిపి సిహెచ్.సునీత పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం

వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య అధ్యక్షతన వైసిపి సీనియర్ నాయకులు బత్తిన చిన్నా ఆధ్వర్యంలో రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం ముగించుకుని రెండో వార్డులో వై నీడ్స్ ఎపి జగన్ కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా బత్తిన చిన్నా మాట్లాడుతూ రానున్న రోజుల్లో సిఎం జగన్ ముఖ్యమంత్రిగా మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, నెకూరి కిషోర్, అయినాల వెంకటరమణమూర్తి, సంకు సురేష్, ఎల్‌విఆర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

సీసీ రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ఊటుకూరులో రూ.18 లక్షల గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో మంజూరై నిర్మాణం పూర్తి చేసుకున్న సీసీ రోడ్లను శుక్రవారం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎన్ఆర్ మాట్లాడుతూ జగనన్న పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, సర్పంచి సుధాబత్తుల వరలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు దూసనపూడి లక్ష్మీకుమారి, పార్టీ నాయకులు అర్జా కిషోర్, రాచూరి కుమార్, రంగిశెట్టి నరసింహరావు, పెయ్యేరు ఉప సర్పంచి దివి సతీష్, పత్తి శ్రీనివాసరావు, కూనపరెడ్డి సత్యనారాయణ, మీసాల రామకృష్ణ, పెయ్యేటి కిరణ్మయి, దూసనపూడి దాసు, సుధాబత్తుల రమణ, ఇఒపిఆర్‌డి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సిఐటియు నేత ఎ.వెంకటేశ్వరరావుకు పితృవియోగం

ప్రజాశక్తి - విజయవాడ

సిఐటియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకటేశ్వరరావుకు శుక్రవారం పితృవియోగం కలిగింది. వెంకటేశ్వరరావు తండ్రి శేషారావు (72) అనారోగ్యంతో ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఎర్రంపల్లిలోని స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు వెంకటేశ్వరరావు, కోడలు కమల సిపిఎం జిల్లా కమిటీ సభ్యులుగా, పూర్తికాలం కార్యకర్తలుగా పనిచేస్తున్నారు. శేషారావు మృతి పట్ల సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్ శ్రీనివాస్, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కష్ణ, సీనియర్ నాయకులు బి.ఆర్.తులసీరావు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. శేషారావు మదు స్వభావి అని వారు పేర్కొన్నారు.


శేషారావు (ఫైల్)

డ్రెయినేజీల ప్రక్షాళన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని రైతు బజార్ రోడ్డులో ఇరువైపులా డ్రెయినేజీలో శుక్రవారం పూడిక తీశారు. ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదేశంతో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో శానిటరీ అధికారుల పర్యవేక్షణలో డ్రెయినేజీల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. డ్రెయినేజీల్లో చెత్త వేయవద్దని దుకాణదారులకు సూచించారు. చెత్త సేకరణకు గ్రీన్ అంబాసిడర్లు వస్తారని డాక్టర్లలో మాత్రమే చెత్త వేయాలని చెప్పారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ఇప్పటివరకు సుమారు 2000 ఎకరాల్లో వరి కోతలు జరిగాయని, 1380 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆర్‌బికెల ద్వారా సేకరించినట్లు మండల వ్యవసాయాధికారి బొర్రా వేణుమాధవ్ శుక్రవారం తెలిపారు. హర్వెస్టర్ల ద్వారా కోత కోసి రాసి మీద సుమారు 500 ఎకరాల పంట, అలాగే పనల మీద సుమారు 200 ఎకరాల వరకు పంట ఉందని తెలిపారు. ప్రస్తుతం ఏర్పడిన ఉపరితల ద్రోని వలన మండలంలో చెదురు మదురుగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల రైతాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి కోతలను ఈ వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు వాయిదా వేయడం మంచిదన్నారు. ఇప్పటికే కోసి పనల మీద ఉంచినట్లయితే పనలను సురక్షిత ప్రదేశానికి తరలించి టార్పాలిన్‌లు కప్పుకోవాలన్నారు. పొలాల నుంచి నీరు బయటకు పోయేటట్లు డ్రెయిన్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ధాన్యం మొలకెత్తడం, రంగు మారడాన్ని నిరోధించడానికి తడిసిన వరి కంకుల మీద, పనల మీద ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పును కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. బిపిటి 5204, 1100 వరి రకాలు పంట కోతకు వచ్చినట్లయితే గింజ మొలకెత్తకుండా ఉండటానికి నిలువు మీద ఉన్న పంటకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని వేణుమాధవ్ తెలిపారు.

నూజివీడు రూరల్ : మండలంలోని వరి రైతులకు తుపాను హెచ్చరికలు జారీ కావడంతో అప్రమత్తంగా ఉండాలని వరి సాగు రైతులకు నూజివీడు మండల వ్యవసాయాధికారి చాముండేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వరి కోతలను నిలిపివేయాలని, ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్త పడాలన్నారు. వాతావరణ అనుకూలతను బట్టి కోతలను మొదలు పెట్టాలన్నారు. అశ్రద్ధ వహిస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు.